# మావోయిస్టులపై నిఘా కొనసాగించండి




భూపాలపల్లి రూరల్ : సమావేశంలో మాట్లాడుతున్న గ్రేహౌండ్స్ అడిషనల్ డీజీ విజయ్‌కుమార్

- వారి టార్గెట్లకు రక్షణ కల్పించండి
- పోలింగ్ కేంద్రాల వద్ద అదనపు బలగాలను మోహరించండి
- గ్రేహౌండ్స్ అడిషనల్ డీజీ విజయ్ కుమార్

భూపాలపల్లి రూరల్, నవంబర్ 1 : అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో మావోయిస్టులపై ప్రత్యేక నిఘా కొనసాగించాలని గ్రేహౌండ్స్ అడిషనల్ డీజీ విజయ్ కుమార్ అన్నారు. బుధవారం సాయంత్రం జిల్లా కేంద్రంలోని కేటీపీపీ గెస్ట్‌హౌస్‌లో జయశంకర్ భూపాలపల్లి, ములుగు జిల్లాల ఎస్పీలు కిరణ్ ఖరే, గౌష్ ఆలంతో పాటు రెండు జిల్లాల మావోయిస్టు ప్రభావిత ప్రాంతాల పోలీసు అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రెండు జిల్లాల ఎస్పీలు కిరణ్ ఖరే, గౌష్ ఆలం జిల్లాల్లో నెలకొన్న పరిస్థితులను గ్రేహౌండ్స్ అడిషనల్ డీజీకి వివరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. మావోయిస్టులపై ప్రత్యేక నిఘా కొనసాగించాలని, సరిహద్దు రాష్ట్రాల అధికారులతో సమాచార మార్పిడి చేసుకోవాలని సూచించారు. మావోయిస్టులు హింసాత్మక ఘటనలకు పాల్పడకుండా కట్టడి చేసి ప్రశాంతంగా ఎన్నికలు జరిగేలా చూడాలన్నారు. ప్రభావిత ప్రాంతాల్లో కూంబింగ్ నిర్వహించాలని, నిరంతరం తనిఖీలు చేపట్టాలని, మావోయిస్టు టార్గెట్లకు రక్షణ కల్పించాలని ఆదేశించారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల వద్ద అదనపు బలగాలను ఏర్పాటు చేయాలని, నామినేషన్ నుంచి మొదలుకొని పోలింగ్ పూర్తయ్యేవరకు ఎక్కడా పొరపాట్లకు తావు లేకుండా అప్రమత్తంగా విధులు నిర్వర్తించాలని పేర్కొన్నారు. కేంద్ర పారామిలిటరీ దళాలను ఉపయోగించి పటిష్ట భద్రతా చర్యలు చేపట్టాలన్నారు. ఎస్‌ఐబీ ఐజీ ప్రభాకర్ మాట్లాడుతూ.. మావోయిస్టు ప్రభావిత ప్రాంతాల పోలింగ్ కేంద్రాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో మావోయిస్టులను కట్టడిచేయడానికి తీసుకోవాల్సిన ముందస్తు చర్యల గురించి పోలీస్ అధికారులకు వివరించారు. కార్యక్రమంలో భూపాలపల్లి ఓఎస్‌డీ అశోక్ కుమార్, ఏటూరు నాగారం ఏఎస్పీ సంకీర్త్, ఎస్‌ఐబీ ఓఎస్‌డీ దయానంద్ రెడ్డి, డీఎస్పీలు రాములు, రామ్మోహన్ రెడ్డి, రవీందర్, సంపత్‌రావు, పోలీసు అధికారులు పాల్గొన్నారు.

### కాళేశ్వరంలో అడిషనల్ డీజీ పూజలు..

కాళేశ్వరం : కాళేశ్వర ముక్తీశ్వర స్వామి వారి ఆలయంలో అడిషనల్ డీజీ విజయ్ కుమార్ ప్రత్యేక పూజలు చేశారు. తొలుత ఆలయ అర్చకులు అడిషనల్ డీజీకి పూర్ణకుంభ స్వాగతం పలికారు. అనంతరం అర్చకులు ఆశీర్వచనం చేసి స్వామి వారి శేష వస్త్రాలతో పాటు చిత్రపటం అందజేశారు. కార్యక్రమంలో ఎస్సై లక్ష్మణ్ రావు పాల్గొన్నారు.

## ఎన్నికల నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు

- డబ్బులు పంచిన కొండా సురేఖ, ఎర్రబెల్లి రేణుకపై కేసు నమోదు
- తూర్పు రిటర్నింగ్ అధికారి షేక్ రిజ్వాన్ బాషా

వరంగల్, నవంబర్ 1 : ఎన్నికల నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని తూర్పు నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి షేక్ రిజ్వాన్ బాషా ఒక ప్రకటనలో తెలిపారు. ఎన్నికల కోడ్ అతిక్రమించిన వారిపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఓటర్లు ప్రశాంత వాతావరణంలో ఓటు వినియోగించుకునేలా అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. వరంగల్ తూర్పు నియోజవర్గ కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న కొండా సురేఖ ఎన్నికల నిబంధనలు ఉల్లంఘించి ఓటరుకు డబ్బులు పంచుతున్న వీడియో సోషల్ మీడియాలో వైరల్ కావడంతో ఆమెపై మిల్స్ కాలనీ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసినట్లు చెప్పారు. ఇదే నియోజకవర్గం నుంచి బీజేపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న ఎర్రబెల్లి ప్రదీప్‌రావు సతీమణి రేణుక ఓటరుకు డబ్బులు పంచుతున్న ఫొటో ట్విట్టర్‌లో వైరల్ కావడంతో ఆమెపై మట్టెవాడ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

## శబరిమలకు ప్రత్యేక బస్సులు

**భక్తుల కోసం వరంగల్ నుంచి సూపర్ లగ్జరీ, ఎక్స్‌ప్రెస్ బస్సులు**

హనుమకొండ చౌరస్తా, నవంబర్ 1 : వరంగల్-1 డిపో నుంచి శబరిమలకు అద్దె ప్రతిపాదికన సూపర్ లగ్జరీ, ఎక్స్‌ప్రెస్ ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేస్తున్నట్లు మేనేజర్ వెంకటేశం తెలిపారు. ఈ బస్సులను కోరుకున్న ప్రదేశం నుంచి, దర్శించుకోవాల్సిన పుణ్యక్షేత్రాల మీదుగా నడుపనున్నట్లు చెప్పారు. బస్సుల్లో గురుస్వామితో పాటు ఇద్దరు వంటవాళ్లు, ఇద్దరు మణికంఠలు, అటెండర్ ఫ్రీగా ప్రయాణించే అవకాశం కల్పిస్తామని వెల్లడించారు. బస్సులు బుక్ చేసిన ఔత్సాహికులు, గురుస్వాములకు రోజుకు రూ.300 చొప్పున కమిషన్ ఇస్తామని, బస్సుల్లో ఆడియో, వీడియో సౌకర్యం, సెల్‌ఫోన్ చార్జర్లు ఏర్పాటు చేసినట్లు వివరించారు. మరిన్ని వివరాలకు 9959226047, 9866373825, 7382855793 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

## గ్రామీణ రహదారులపై నిట్ విద్యార్థుల పరిశోధన



టెస్ట్ పిట్‌ను పరిశీలిస్తున్న ప్రొఫెసర్ శంకర్

హనుమకొండ చౌరస్తా, నవంబర్ 1 : భారత ప్రభుత్వం పేదరిక నిర్మూలన వ్యూహంలో భాగంగా గ్రామీణ రహదారుల నిర్మాణానికి రాష్ట్రాలకు సహాయం చేయడానికి 25 డిసెంబర్ 2000న ప్రధాన మంత్రి గ్రామీణ్ సడక్ యోజన (పీఎంజీఎస్‌వై-1)ను ప్రారంభించింది. ఈ పథకంలో భాగంగా వేసిన గ్రామీణ రహదారులను వరంగల్ నిట్ ప్రొఫెసర్లు, విద్యార్థులు పరిశీలించారు. అనంతరం ప్రొఫెసర్ శంకర్ మాట్లాడుతూ.. పీఎంజీఎస్‌వై ప్రాథమిక లక్ష్యం గ్రామీణ భారతదేశంలోని అనుసంధానం లేని నివాస ప్రాంతాలకు రహదారి కనెక్టివిటీని అందించడమన్నారు. అలాగే పీఎంజీఎస్‌వై-2లో భాగంగా ప్రస్తుతం ఉన్న గ్రామీణ రహదారుల్లో 50 వేల కిలోమీటర్లను అప్‌గ్రేడ్ చేయాలని కేంద్రం లక్ష్యం పెట్టుకున్నదని చెప్పారు. మూడు సంవత్సరాల వారీగా కొత్త మెటీరియల్, టెక్నాలజీని ఉపయోగించి పూర్తి చేసిన రహదారి పొడవు 8,870, 11,235, 16,038 కిలోమీటర్లు అని తెలిపారు. ఇది ఈ మెటీరియల్, టెక్నాలజీల వినియోగంలో పెరిగిన ట్రెండ్‌ను చూపుతుందన్నారు.

# మద్దతు ధరతో పత్తి కొనుగోళ్లు

- రైతులకు ఇబ్బంది లేకుండా చూడాలి
- వరంగల్ జిల్లా కలెక్టర్ ప్రావీణ్య
- ఎనుమాముల మార్కెట్‌లో సీసీఐ కొనుగోలు కేంద్రం ప్రారంభం



ఎనుమాముల మార్కెట్‌లో సీసీఐ కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న వరంగల్ జిల్లా కలెక్టర్ ప్రావీణ్య

కాశీబుగ్గ, నవంబర్ 1 : వరంగల్ ఎనుమాముల వ్యవసాయ మార్కెట్‌లో బుధవారం కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ)ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోల్ సెంటర్‌ను కలెక్టర్ పీ ప్రావీణ్య ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. సీసీఐ వారు రైతుల నుంచి మద్దతు ధరతో పత్తిని కొనుగోలు చేస్తారని తెలిపారు. రైతులకు ఇబ్బంది కలుగకుండా పత్తిని కొనుగోలు చేయాలని మార్కెటింగ్, సీసీఐ అధికారులను ఆదేశించారు. నాణ్యత గల పత్తిని సీసీఐ సెంటర్‌కు తీసుకువచ్చి మద్దతు ధర పొందాలని రైతులకు సూచించారు. కార్యక్రమంలో సీసీఐ డిప్యూటీ జనరల్ మేనేజర్ దవే, అసిస్టెంట్ మేనేజర్ సచిన్ షిండే, జేడీఎం ఎన్నారపు మల్లేశం, డీడీఎం అజ్మీరా రాజునాయక్, డీఎంవో పాలకుర్తి ప్రసాదరావు, కార్యదర్శి బరుపాటి వెంకటేశ్ రాహుల్, గ్రేడ్-2 కార్యదర్శులు ఎండీ బియాబాని, శ్రీరామోజు రాము, చాంబర్ అధ్యక్షుడు బొమ్మినేని రవీందర్‌రెడ్డి, కాటన్ ఖరీదు వ్యాపారులు, జిన్నింగ్ మిల్లు యజమానులు పాల్గొన్నారు.

# గుడుంబా స్థావరాలపై ఎక్సైజ్ దాడులు



ఖానాపురం : బోటిమీది తండాలో స్వాధీనం చేసుకున్న బెల్లం పానకం డ్రమ్ములను చూపుతున్న ఎక్సైజ్, పోలీసు అధికారులు

ఖానాపురం, నవంబర్ 1 : మండలంలోని బోటిమీది తండాలో గుడుంబా స్థావరాలపై బుధవారం పోలీస్, ఎక్సైజ్ అధికారులు సంయుక్తంగా దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో 2 వేల లీటర్ల బెల్లం పానకాన్ని ధ్వంసం చేశారు. ఈ సందర్భంగా ఎక్సైజ్ సీఐ రమేశ్ చంద్ర, ఎస్సై మాధవ్‌గౌడ్ మాట్లాడుతూ.. గుడుంబా తయారు చేసినా, విక్రయించినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. గుడుంబా వల్ల అనేక మంది యువకులు చిన్న వయసులోనే మృత్యువాత పడుతున్నారని, వారి కుటుంబాలు ఛిద్రమవుతున్నాయని పేర్కొన్నారు. ఇప్పటికైనా గుడుంబా తయారీదారులు తమ విధానాలను మార్చుకోవాలని కోరారు.

### గీసుగొండలో..



గీసుగొండ : మొగిలిచెర్లలో పట్టుకున్న గుడుంబాను చూపుతున్న టాస్క్‌ఫోర్స్ పోలీసులు

గీసుగొండ : గ్రేటర్ వరంగల్ 15వ డివిజన్ మొగిలిచెర్ల గ్రామంలో గుడుంబా విక్రయిస్తున్న ధరావత్ ధన్‌సింగ్ ఇంటిపై టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడులు చేసి 32 లీటర్ల గుడుంబాను పట్టుకున్నట్లు టాస్క్‌ఫోర్స్ సీఐ పెండ్యాల దేవేందర్ తెలిపారు. గుడుంబా విక్రయిస్తున్న ధరావత్ ధన్‌సింగ్‌పై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

# రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

పాలకుర్తి, నవంబర్ 1 : రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి చెందిన ఘటన ఈరవెన్ను గ్రామ సమీపంలో మంగళవారం అర్ధరాత్రి జరిగింది. ఎస్సై శ్రీకాంత్ తెలిపిన వివరాల ప్రకారం.. తిరుమలగిరికి చెందిన బక్క రాజు(27) దర్దేపల్లిలో ఉంటున్న భార్య, ఇటీవలే జన్మించిన కుమారుడిని చూడడానికి బైక్‌పై వెళ్తున్నాడు. ఈరవెన్ను శివారులోని మలుపు వద్ద అడవి జంతువు వాహనానికి అడ్డుగా రావడంతో తప్పించబోయి పక్కనే ఉన్న చెలకలో పడ్డాడు. దీంతో తలకు గాయాలు కాగా, స్థానికులు గమనించి కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. ఓ ప్రైవేట్ వాహనంలో జనగామ ఏరియా దవాఖానకు తరలించగా, అప్పటికే రాజు మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. బుధవారం భార్య అనూష ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

# మిరప తోటలను సందర్శించిన శాస్త్రవేత్తలు

ఖిలావరంగల్, నవంబర్ 1 : గ్రేటర్ వరంగల్ బొల్లికుంటలోని మిరప తోటలను కృషి విజ్ఞాన్ కేంద్రం శాస్త్రవేత్తల బృందం సందర్శించింది. మిరప తోటల్లో తామర పురుగుల ఉధృతిని గుర్తించారు. అలాగే గొర్రెలను పరీక్షించి, సీజన్‌లో వచ్చే వ్యాధులు, నివారణ చర్యలపై గొర్ల కాపర్లకు వివరించారు. కో ఆర్డినేటర్ రాజన్న ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో సస్య రక్షణ శాస్త్రవేత్త రాజు పాల్గొన్నారు.



బొల్లికుంటలోని మిరప తోటను పరిశీలిస్తున్న కృషి విజ్ఞాన్ కేంద్రం శాస్త్రవేత్తలు